# బృంద గీతం

"చాలా అర్జెంటు ఒక్క యాభై రూపాయలు కావాలి'' అన్నాడు నారాయణ వచ్చి కూర్చుంటూనే.

ఇంతకు ముందే వచ్చి నివేశన స్థలంలో కూర్చుని, నారాయణ కోసరం నిరీక్షిస్తూ, అతని రాకను త్వరితం చెయ్యమని----మనస్సులో బహుశా దేవుడినే కావును----స్మరణ చేసుకుంటూ----అంత కంటే మరేమీ చేయలేక కూర్చున్న నలుగురు మిత్రులూ దిగ్భ్రాంతులయ్యారు. ఎవ్వడికి వాడే ఆలోచన. రానున్నది రాత్రి. ఎవడికీ స్వంత పనులంటూ లేవు. ఒక్కసారిగా యాభైరూపాయలు---యాభై దమ్మిడిలే అయితే మటుకు ఎట్లావస్తాయి? అయిదుగుర్నీ కలిపి ---- బానిసలలా అమ్మినా అయిదు కాన్లు వస్తాయని గ్యారంటీ లేదు. పైగా యీ రోజుల్లో బానిసల వ్యాపారం ఎవరు చెయ్యడానికి కూర్చున్నారు. అంతకంటే లక్షల రెట్లు నయమయినవి కోట్ల కొద్దీ వుండగా!

"ఏమిరా ఎవడి ముఖంలోనూ కళాకాంతులు లేవేమిటి? ఏడుస్తా రెందుకు ---- ఘాటుగా ఆలోచించాలి గాని----!'' అంటాడు నారాయణ! వాడికి తెలీదు, యింతసేపూ తనకోసం ఒక్కొక్కడూ ఎంతగా కళ్లలో ఒత్తులు పెట్టుక చూస్తున్నారో యిట్లా హటాత్తుగా ఓ సాధ్యంగాని సమస్య యిచ్చి ఏడిపించేందుకా? యేదో కట్టుకథ చెప్పి నవ్వించేందుకు గాని! వాడికి ఇవేమీ ఆలోచనలు రావు. వాడి బుర్ర ఎప్పుడూ అతీతంగా ఆలోచిస్తుంది. ----అనుకొంటున్నారు నలుగురు మిత్రుల్లో ఒక్కొక్కడూ!

ధైర్యం చేసి, అప్పుడే మాటల్ని సృష్టిస్తున్నట్లు ఒక్కటే నాలుగు ఘడియలు ఆలోచించి వాడుతూన్నట్లు సాంబంగాడు అన్నాడు: 'యాభై రూపాయలు అర్జంటా? ఎట్లా వస్తయ్యి?'

"అవును! తెల్లవారేటప్పటికి కావాలి! యాభై రూపాయలు లేకపోతే యిక మనం బ్రతకటమే వృధా! అందరం కట్టకట్టుకు యే గంగలోనో, గోదావరిలోనో మునగటం మంచిది! ఒక్క యాభై రూపాయలు అర్జంటు" అన్న మాటను మళ్లీ మళ్లీ అన్నాడు నారాయణ.

"ఉహూ, ఒక్క రెండు నెలలు టైము యిస్తేగాని లాభం లేదు!" అంటున్నాడు సత్యం. ఎలాగైనా మిత్రుని ఆపద తీర్చి తీరాలనే సత్య సంకల్పంతో.

"రెండు నెల్లా? ఒరినీ..., రెండు రోజులు కూడా లాభం లేదు. ఒక మూల, నారాయణగాడు తెల్లవారేసరికి కావాలంటూంటే...!

"నువ్వు త్రేభ్య స్వరూపుడి లాగ...! అంటూ దీవెనలు మొదలెట్టబోతున్నాడు సత్యానికి బావమరది సుందరం.

సాంబానికి మళ్లా వివేకం వచ్చినట్టయింది----"ఓరి మీ దుంపలు తెగ----యాభై రూపాయలు తొందరగా కావాలంటూంటే, మధ్య మీరిద్దరూ తగువుకు దిగుతారేమిట్రా? వెధవలు ప్రపంచానికి పనికొచ్చే తెలివితేటలు తప్ప తక్కినవన్నీ వున్నయ్యి....!"

నారాయణ మళ్లా అన్నాడు: "శుష్క ప్రియాలతో లాభం లేదు, మీరు మీరూ యేం ఆలోచించుకుంటారో, నాకు తెల్లారేటప్పటికి యాభై రూపాయలూ తెచ్చి యివ్వాలి. పొద్దున్నే మీరే వచ్చి నన్ను నిద్ర లేపాలి!" యాభై రూపాయల మీద తనకేం ఆసక్తి లేనట్లు, అది తనకేం సంబంధించింది కానట్లు.

ఎవడికీ నోట మాట రావడం లేదు. పొరపాటున యేవన్నా వాగినా పక్కవాడు ఏ మంటాడో, తనమాటలే తనకు ఎదురు కొడతాయో అని భయం. మనసులో మట్టుకు ఆలోచన. ఏమని? ఏమనాలో వాళ్లకు తెలీదు, ఎంత దూరమో వాళ్లకు తెలీదు. హిమగిరి శిఖరాలు ఎక్కుతోన్నట్లు బాధపడుతున్నారు. తమ చేతగానితనానికి ఖేదపడుతున్నారు. అంతకంటే దిక్కు తోచక వెర్రి ముఖాలతో ఒకళ్లవే పొకళ్లు చూసుకుంటున్నారు. వాళ్ల జన్మంతా కలిపితే దాని విలువ ఎంతో యింకా నిర్ధారణ కాలేదు. తెల్లవారే సరికి అనుకున్న ప్రకారం యాభై రూపాయలు ఎట్లా వస్తయ్యి?----ఎట్లా తీరుస్తారు? మిత్రుని ఋణం ఒకడికి యిద్దరు, యిద్దరికి ముగ్గురు ----చేదోడు వాదోడుగా అయిదుగురు వుంటే

16)



మటుకు? వెనక ----నూరుగురు గుడ్డివాళ్లు వుండీ కూడా అందరూ పాడుపడ్డ బావిలో పడ్డారట. నూరుగురేం ఖర్మ! వెయ్యి మంది, లక్షమంది, లెక్కించటానికి వీల్లేనంత మంది కంటే ఎక్కువ మంది ---- ఉన్నా అంతా విధిగా బావిలోపడి తీరవలసిందే, యే మంటే ---అందరూ గుడ్డివాళ్లే! అట్లా వుంది తమ పని! అయిదుగురూ యింటి దగ్గర ఏమీ విలువలేనివాళ్లూ, బజారులో దమ్మిడీ సంపాదన లేనివాళ్లూ!

అంతా సమావేశం అయ్యేటప్పటికే చీకటి పడింది. యీ సందిగ్ధంలో పడి దిక్కుతోచక----పైకేమీ మాటాడలేక పిరికిగా బెదురుగా కూచున్న చోటే నేలకు అంటుకు పోయి, అక్కడే స్వతస్సిద్ధంగా అవతరించినట్టు అనిపించే స్థితి వచ్చేసరికి, కాలం ఎంత అయిందో కూడా తెలీదు.

"మన ఆధీనంలో ఒక కామధేనువు వుంటే---- అంతెందుకు కనీసం----కావాలనుకున్న వల్లా యిచ్చే కోరికల సంచీ వుంటే ---- నాచేతి నిండా వుంగరాలు మొలవాలని కోరుకుని, వాటిని తీసుకెళ్లి బంగారయ్య కొట్లో తాకట్టు పెట్టి, యాభై రూపాయలు తెచ్చి నీకు యిచ్చి వుండేవాడిని!" అంటూ అర్థ స్వగతంగా, మనసులో అనుకుంటున్నట్టు అన్నాడు సత్యం.

"నీ తెలివి తెల్లారినట్టే వుంది. కామధేనువంటూ వుంటే డబ్బంటూ ఎందుకూ?----"

"అయితే మన కిప్పుడు కామధేనువు కావాలా? డబ్బు కావాలా?"

..................

"రెండూ కావాలి!"

"ముందు యేది కావాలి?"

"డబ్బు----ఒక్క యాభై రూపాయలు!"

"నీ మొహం. కామధేనువు, ముందు."

"నీకు తెలియదు ఊరుకోరా, వెధవన్నర వెధవా ముందు డబ్బొచ్చేస్తే..."

----నారాయణ ఇంక భరించలేక చెయ్యి ఎత్తి నోటితో పెద్దగా బూతులు మాట్లాడి ''ఒకడిని మించిన వెధవలు ఒకళ్ళు. నోరు మూసుకు యేడవండి. తెల్లారే సరికి యాభై రూపాయలు లేకపోతే నేను బతకలేను!''

మళ్లా నిశ్శబ్దం.

ఏం ఆలోచిస్తున్నారో తెలియదు. ఎంతవరకాలోచిస్తారో తెలియదు.

ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుంటూ ఆలోచించటంకంటే మరోటి చేతగానట్టు పోజు వేసు క్కూర్చున్నారు.

''అర్ధరాత్రి సరిగ్గా పన్నెండు గంటల పన్నెండు నిమిషాలకు శ్మశానానికి వెళ్ళి ---- వెదకాలి!''----''పరమ శివుడు ప్రత్యక్షమై...''

''నోరు మూస్తావా, లేదా...''

''ఒరే, వెంటనే వెళ్ళి జీరోఫైవ్ బ్రాకెట్టు----''

''అందుకు మాత్రం డబ్బులు? వస్తుందని గ్యారంటీ----''

.......................

''అందరం కలిసి దొంగతనం చేదాం----''

''అందరం కలిసి దొంగతనం చేసినా, అందర్నీ ఒకే జైలులో పెట్టారు -----ఒకడిని జర్మనీ, యింకొకడిని జపాను, మరొకడిని అమె....''

''రాస్కెల్----''

''ఒరే నాకు మంచి నిద్రవస్తోంది. నేను పోయి పడుకుంటా. రేప్పొద్దున్నే వచ్చి నాకు డబ్బిచ్చి వెళ్ళండి----'' అంటూ నారాయణ ఎవరికోసమూ వెనక్కి తిరగకుండా చరచరా నడిచి వెళ్ళాడు.

మిగిలిన నలుగురూ చాలాసేపు తర్కించుకున్నారు. యాభై రూపాయల గురించి. చివరికి లేచి పోతూ మర్నాడు తెల్లవారుతూనే అందరూ నారాయణ యింటి దగ్గర చేరుకోవాలని గట్టిగా తీర్మానించుకున్నారు.

ప్రపంచానికి తెల్లవారింది.

నలుగురూ నారాయణ యింటి ముందు చేరుకున్నారు.

''నారాయణా, నారాయణా----నారా...'' నిద్ర మత్తులో అప్పడే లేచి పంచ సరిచేసుకుంటూ, కళ్ళు తుడుచుకు చూస్తూ లోపల గదిలోంచి వసారాలోకి వచ్చాడు నారాయణ. చూడగానే నలుగురు మిత్రులకూ కళ్ళలో కొత్త కాంతులు ప్రవేశించినై! నారాయణని చూస్తూ మనుకోలేదు వాళ్ళు! నాలుగు నిమిషాలు స్తబ్ధులై నించున్నారు.

సాంబం నోరంతా విప్పి ''యేవిరా, దొరికాయా?'' అన్నాడు.

''యేమిటి?''

''యాభై రూపాయలు----''

''మిమ్మల్ని తెమ్మని కదరా నే చెప్పింది, ఇంతకూ తేలేదా యేమిరా మీరు----?''

''ఉహూ''

''దొరక లేదు''

''ఎక్కడా కనబళ్ళేదు.''

''నువ్వు ఎక్కడో సంపాయించే వుంటావనుకున్నాం.''

''ఏడవండి వెధవల్లారా----'' అంటూ నారాయణ తిన్నగా లోపలికి వెళ్లిపోయాడు. నలుగురూ నేల మీద కుప్పగా కూలిపోయారు.

మరో అయిదు నిమిషాల్లో నారాయణ ముఖం కడుక్కుని దుస్తులు వేసుకు బయటకొచ్చి ''రంధ్రా పోదాం----'' అని వాళ్ళను చెరువు గట్టుకు లాక్కుపోయాడు.

''యాభై దొరకలేదు కదరా! ఎట్లా?'' అంటాడు సుందరం. యీ మాట తనే అనాలని ముందర నించీ కాచుక్కూర్చున్నాడు.

''ఎందుకురా యాభై?''----నారాయణ.

అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం!

''నువు కావాలని----''

''యేడిశారు వెధవలు----నాకెందుకు రా డబ్బు----యాభై రూపాయలు?----''

"అవును నీ కెందుకు ---- మేనమామ యింట్లో భోజనం చేస్తుంటివి యింకెందుకు" సొంబం.

"అవును నీకు డబ్బక్కర్లేదు----చిల్లి గవ్వ కూడా అక్కర్లేదు----"

"సిగరెట్టు, బీడి, చుట్ట వగైరా అలవాట్లు లేవు----నీ కెందుకు యిక డబ్బు?"

"నారీ వ్యసనం అంతకంటే లేదు. యింక డబ్బుతో నిమిత్తం?"

"యేడిశార్లెండి వెధవల్లారా! మరి నిన్ననే ఎందుకు తోచాయి కావు, యీ మాటలు?"

"ఏవి?"

"నాకు రూపాయలు అక్కర్లేదని!"

"నువ్వు కావాలంటివిగా!"

"అయితే కావాలా?"

"అక్కర్లేదు----"

"మరి"

"ఏమో! నువు కావాలంటే, నిజంగా కావాలేమో అనుకున్నాం."

నారాయణ నవ్వాడు. "నాకు తెలుసు మీ తెలివి తేటలు ఎంతవరకు పనిచేస్తాయో అని యీ పరీక్ష పెట్టాను."

కాసేపటి దాకా ఎవరు మాటాళ్ళేదు. తరవాతే సుందరం గావును అడిగాడు: "నువ్వు ఈ పరీక్ష ఎందుకు పెట్టినట్లు?"

"నిన్న చెప్పటానికి కథేమీ తోచలేదు. కొత్తరకం ఆట అడిద్దామని యీ ఎత్తు ఎత్తాను. అంతా ఓడిపోయారు!" అన్నాడు నారాయణ. ❋

(ఆంధ్ర ప్రభ సచిత్ర-వార పత్రిక)